క్లుప్తంగా

సీఆర్ఆర్‌లో వన మహోత్సవం



జాతీయ జెండా ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక భోగాపురం బైపాస్ రోడ్డులోని రాష్ట్రంలోనే అతి పెద్ద జాతీయ జండా ప్రాంగణంలో 108 మొక్కనలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటాలని, తద్వారా వాతావరణ సమతౌల్యత ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలకమండలి సభ్యుడు కొండా హరిరామ కృష్ణంరాజు, ఎంబీఏ హెచ్ఓడీ కొడాలి వెంకట శ్రీధర్, స్టాఫ్ కోఆర్డినేటర్స్ నిమ్మల సతీష్, ఈడ్పుగంటి కవిత తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితే ఉన్నత స్థానాలు



విద్యార్థులను బహుమతులతో సత్కరిస్తున్న రాధాపుష్పావతి, తదితరులు

భీమడోలు: ఇష్టంగా చదవివతే ఉన్నతంగా ఎదుగుతారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ జిల్లా చైర్‌పర్సన్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాధా పుష్పావతి మాట్లాడారు. విద్యార్థులకు తొలి మెట్టు పదో తరగతి అని, మంచిగా చదువుకుని తన బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని, వ్యాసనాలకు దూరంగా ఉండాలని, మనోధైర్యంతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి తెలుగు, ఇంగ్లిషు మీడియంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన ఆరుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు, గ్రామర్ బుక్స్, పతకాలు, జ్ఞాపికలను అందించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే ఆళ్ల నాని



సమీక్షలో మాట్లాడుతున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



సమీక్షకు హాజరైన నగరపాలక అధికారులు, సచివాలయ ఉద్యోగులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నగరంలోని 1, 2, 28వ డివిజన్లలో ఇటీవల చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులతో ఆయన సమీక్షించారు. స్థానిక డివిజన్లలో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, వీధి దీపాలు, ఇతరత్రా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా అధికారులు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో డివిజన్‌కు రూ.50 లక్షల నిధులు అభివృద్ధి పనులకు కేటాయించేలా చర్యలు చేపట్టారు. మూడు డివిజన్ల పరిధిలో సుమారు రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాని ఆమోదం తెలిపారు. అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని ప్రతి డివిజన్‌లోనూ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని నాని చెప్పారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక డివిజన్లలో రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు ఏమి అవసరమో తెలుసుకుని, ప్రజాప్రతినిధుల కోరిక మేరకు నిధులు మంజూరు చేస్తున్నామని వివరించారు. నగరం రూపు రేఖలు మార్చివేసేందుకు పక్కా ప్రణాళికతో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సమీక్షలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, అదనపు కమిషనర్ బాపిరాజు, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్, నగరపాలక అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఎంపికైన వారి వివరాలు త్వరలో తెలియజేస్తాం



జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో ఒక ఏడాది కాలం తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు అకౌంటెంట్ గ్రేడ్–3 రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 55 మంది అభ్యర్థుల్లో ఈనెల 21న నిర్వహించిన విద్యార్హతల ఒరిజినల్ ధ్రువీకరణల పరిశీలనకు 29 మంది హాజరయ్యారని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత ఆధారంగా నియామక నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం, మెరిట్, రోస్టర్ పాయింట్స్ అనుసరించి ఎంపిక వివరాలను ఏలూరు జిల్లా అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఏలూరు.ఏపీ.డాట్.ఇన్ /నోటీస్ అండ్ కేటగిరి / రిక్రూట్‌మెంట్ /లో లేదా ఎంపికయిన అభ్యర్థుల వ్యక్తిగత ఫోన్లకు సమాచారం తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ఆదిత్య కళాశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు



సీఆర్ఆర్ అటానమస్‌లో బాబూరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని వివిధ కళాశాలల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో గణితంలోని ముఖ్య భావనలపై ఏర్పాటుచేసిన నేషనల్ వెబినార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు ప్రారంభించి మాట్లాడారు. గణితాన్ని అన్ని శాస్త్రాల మాతృకగా అభివర్ణించారు. నిత్య జీవితంలో తార్కిక ఆలోచనలకు గణితం పదునుపెడుతుందని అన్నారు. కళాశాల గణిత విభాగాధిపతి పీఆర్ కావ్య శ్రీ, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు కె.అజయ్ కుమార్, సీహెచ్ ఉదయలక్ష్మి, ఎం కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

అన్ని రంగాలూ గణితంపైనే ఆధారం

సమాజంలో అన్ని రంగాలూ గణితంపై ఆధారపడి ఉన్నాయని, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలకు గనిత శాస్త్రం మూలమని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గణిత దినోత్సవంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాస రామానుజన్ సంఖ్యా శాస్త్రం, అనంతశ్రీ, అవిరామ వంటి గణిత విభాగాల్లో విశేష కృషి చేశారన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ ఫణి కుమార్, గణిత శాస్త్ర హెచ్ఓడీ షేక్ బాజీ, ఎం ధనలక్ష్మి, సీహెచ్ సంగీత పాల్గొన్నారు.

సీఆర్ఆర్ అటానమస్‌లో..

గణిత దినోత్సవం సందర్భంగా అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. నారాయణపురం డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకులు బాబూరావు మాట్లాడుతూ గణిత విద్యార్థులకు నావిగేషన్, ఎలక్ట్రానిక్స్, డిజిటల్ సిస్టం, కనస్ట్రక్షన్స్, కంప్యూటర్ డిజిటల్ సిస్టం కోడింగ్, డీకోడింగ్, షేర్ మార్కెట్, ఫైనాన్స్ అండ్ బ్యాంకింగ్ రంగాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. డిగ్రీ, పీజీల ద్వారానే జాబ్స్ వస్తాయని అనుకోకుండా రీసెర్చ్‌పై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. స్వయం పోర్టల్‌లో ఉండే ఉచిత ఆన్‌లైన్ కోర్సుల్లో డిప్లొమా, నైపుణ్యం పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం బాబూరావును ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రామరాజు, కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, పీజీ డైరెక్టర్ వీఆర్ఎస్ సతీష్‌బాబు, జి.రాము పాల్గొన్నారు.

తోటి వారిని ఆదరించి, ప్రేమించాలి



వికలాంగులకు బస్ పాసు అందిస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : సమాజంలోని తోటివారిని ఆదరించి, ప్రేమించాలన్న ఏసుప్రభువు బోధనలు ప్రతిఒక్కరూ అనుసరించాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర పిలుపునిచ్చారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని బిషప్ హౌస్ ప్రాంగణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సోషల్ సర్వీస్ సెంటర్‌లో డైరెక్టర్ ఫాదర్ తాతపూడి ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సెమీ క్రిస్మస్ వేడుకలో బిషప్ జయరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏసుక్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో పయనిస్తూ తోటివారికి చేయూతనందించాలని సూచించారు. ఏసు చూపిన దయ, ప్రేమ మార్గం ప్రతిఒక్కరికీ అనుసరణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సేవా కేంద్రం అందిస్తున్న సేవలు అభినందనీయమని, నాలుగు జిల్లాల్లో అన్ని వర్గాల ప్రజలకు చేయూత అందిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని తెలిపారు. క్రిస్మస్ పండుగను ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. భారీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పేదలకు దుప్పట్లు, విభిన్న ప్రతిభావంతులకు బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయరావును పలువురు ఫాదర్లు ఘనంగా సన్మానించారు. తొలుత జయరావుకు ఫాదర్లు, సిస్టర్లు ఘన స్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాల మధ్య సెమీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు, మానవత స్వచ్ఛంద సంస్థ రీజనల్ అధ్యక్షుడు అడుసుమిల్లి నిర్మల, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, డీసీపీఓ సూర్యచక్రవేణి, ఆడిటర్ రాధాకృష్ణ, కార్పొరేటర్ నిర్మల గ్జేవియర్, ఫాదర్లు జి.మోజెస్, బాబు జార్జి, మైఖేల్, జాకబ్, రాజు, సిస్టర్ లీలమ్మ, అబ్రహాం మాస్టర్, ఏఎంసీ డైరెక్టర్ జక్కుల బెనర్జీ, ఎలెక్స్, సోషల్ సర్వీస్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా పయనించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు అంకిత భావంతో కృషి చేయాలని జిల్లా యువజన అధికారి డి.కిషోర్ సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శుక్రవారం వీర బాల దివస్ కార్యక్రమంలో భాగంగా మై భారత్ పోర్టల్ రిజిస్ట్రేషన్ ప్రారంభ కార్యక్రమం స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాల సాధన ద్వారా మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్య చక్రవేణి మాట్లాడుతూ వీర బాలదివస్ విశిష్టతను వివరించారు. ఈ నెల 22, 23 తేదీల్లో మై భారత్ పోర్టల్ రిజిస్ట్రేషన్, ప్లాంటేషన్, శ్రమదాన కార్యక్రమాలు, 26న వీర బాలదివస్ కార్యక్రమ ముగింపు జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ఏలూరు అర్బన్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.పద్మావతి, ప్రిన్సిపాల్ పి.శైలజ మాట్లాడారు. విద్యార్థులతో మై భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఇనిస్టిట్యూషనల్ కేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీకాంత్, కౌన్సిలర్ యు.బాలస్వామి, ఓడబ్ల్యూ రాజకుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఈశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటానమస్ కళాశాలలో..

ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో మై భారత్ పోర్టల్ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్ విజయరాజు, జిల్లా మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కేపీవీఎల్ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్య చక్రవేణి హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రామరాజు మాట్లాడుతూ బాలలకు చదువుతోపాటు సామాజిక కార్యక్రమాలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం నవీన్ కుమార్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బీ. ఇమానుయేల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీల సస్పెన్షన్‌పై నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్) : పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీల ఎంపీల అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, ఆప్, భారత్ బచావో పార్టీల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, ఆప్ అధ్యక్షుడు షేక్ మస్తాన్, భారత్ బచావో అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావులు మాట్లాడారు. పార్లమెంటులో కొందరు దుండుగులు అకస్మాత్తుగా దాడి చేస్తే దానిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసే ప్రతిపక్ష పార్టీల ఎంపీలను పార్లమెంటు నుంచి అధికార బీజేపీ సస్పెండ్ చేస్తుందని విమర్శించారు. ఇప్పటి వరకూ 146 మంది ఎంపీలను సస్పెన్షన్ చేశారని తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు లేకండా బీజేపీ తన అనుకూల బిల్లులు ఆమోదించుకుంటుందని దుయ్యబట్టారు. పార్లమెంటుపై దాడి చేసిన దుండగులు కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ ఇచ్చిన పాసుల ద్వారానే పార్లమెంటులోకి జొరబడ్డారని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తే బీజేపీ బండారం బయట పడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు డేగా ప్రభాకర్, వివిధ పార్టీల నాయకులు ఉప్పులూరి హేమశంకర్, బి.సోమయ్య, పీవీ రామకృష్ణ, పి.ఆదిశేషు, బి.జగన్నాథరావు, వి.సాయిబాబు, జి.రవికిషోర్, కె.కనకారావు, బండి వెంకటేశ్వరరావు, మన్నవ యామిని, గొర్లి స్వాతి, మావూరి విజయ,గౌడ రంగబాబు, లంక రామ్మోహన్, సేవాదళ్ సుబ్బారావు, భారత్ బచావో నాయకులు రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	100
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10–15
బెండకాయలు	64	కంద	58
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	60	కీర దోస	36
బీరకాయలు	50	ఫ్రెంచ్‌బీన్స్	74
బీరకాయలు (పందిరి)	70	అల్లం	128
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40–50	పాలకూర	12
దొండకాయలు	70	చుక్కకూర	12
బంగాళదుంపలు	28	తోటకూర	12
ఉల్లిపాయలు	35	గోంగూర	08
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	60	బఠాణి	--
ఆనబకాయ (1)	30–40	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	12
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	19
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	14
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్ఈఎల్	22.15	4822	18
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు –తిరుపతి	16.00	4830	25

నియోజకవర్గంలో రూ.2 వేల కోట్ల అభివృద్ధి

ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు



ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో వాసుబాబు తన మనోగతాన్ని 'సాక్షి' వద్ద వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మధ్యవర్తిత్వం లేని ప్రభుత్వం సృష్టించిన నూతన (ఒరవడి) విధానాన్ని ప్రజలు ఆశీర్వదిస్తారు. అవినీతికి తావులేకుండా కుల మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. వాలంటీరు, సచివాలయ వ్యవస్థతో పాలనను ప్రజల వద్దకు చేర్చాం. నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో 8,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం. 6,000 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. సచివాలయాలు, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు, నాడు – నేడులో పాఠశాల భవనాల నిర్మాణంలో గ్రామాలు కొత్తరూపును సంతరించుకున్నాయి. కరోనా వైరస్ విజృంభించిన సమయంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేశాం. టీడీపీ హయాంలో ధనార్జనే తప్ప అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకున్నది లేదు. అర్హత ఉన్నా ప్రజలు జన్మభూమి కమిటీ సభ్యులు (టీడీపీ కార్యకర్తలు) అనుమతిస్తేగాని పథకాలు పొందలేని పరిస్థితిని చేశాం. ఆవిధానానికి సీఎం జగన్ స్వస్తి పలికి లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా లబ్ధిని జమచేసే విధానాన్ని తీసుకొచ్చారు. ఈ విధానంతోనే వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజప్రతినిధులతో కలిసి ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి వారి మద్దతు కోరుతున్నాం. ప్రజలంతా మా వైపే. వారి ఆశీర్వాదాలు మా పార్టీపైనే ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గడపగడపకూ వెళ్లినప్పుడు ప్రజలు స్వాగతిస్తున్నారు. పథకాలు, అభివృద్ధిని చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తాయి. జగన్‌మోహన్‌రెడ్డి గెలుపే నా గెలుపు'. అని వాసుబాబు ధీమా వ్యక్తం చేశారు.

సామూహిక గీతా పారాయణం



గీతా శ్లోకాల పుస్తకాలు, క్యాలెండర్ విడుదల చేసిన తపన, హైందవి ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తపన ఫౌండేషన్ సహకారంతో హైందవి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక దొండపాడు శ్రీ నం దత్తానాథ క్షేత్రంలో 300 మంది విద్యార్థులతో సామూహిక గీతా పారాయణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తణుకుకు చెందిన త్యాగరాజు విద్యార్థులతో గీతా పారాయణం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ భగవద్గీతలోని 700 శ్లోకాలు నుంచి యువతరానికి ఉపయోగపడే 100 ముఖ్యమైన శ్లోకాలతో ప్రత్యేకంగా ఇంగ్లిష్, తెలుగులో పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గోపరాజు వెంకటరామయ్య, హైందవి అశోక్, గారపాటి రేణుక, విద్యార్థులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద పాదయాత్రకు నీరాజనం



దెందులూరులో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం, భద్రతా, భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం దెందులూరులో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర నిర్వహించారు. దెందులూరు పెదదళితవాడలో సచివాలయాన్ని వైఎస్సార్‌సీపీ నేత కస్సే శ్రీను, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభోత్సవం చేశారు. హెల్త్ సెంటర్, రైతుభరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. వాటర్ ట్యాంక్ వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాలన వల్ల పార్టీ ఆవిర్భావం నుంచి అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో విజయం సాధించేది వైఎస్సార్ సీపీనేనని తెలిపారు. వివిధ పథకాల అమలు తీరు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ప్రతిపక్షం ఓర్వలేకపోతోందని అన్నారు. మోసపూరిత వాగ్దానాలకు తెరలేపిందని ఆరోపించారు. అన్ని రంగాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, క్షేత్ర స్థాయిలో అమలు చేసి చూపించిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కుటుంబమంతా సమష్టిగా కృషి చేసి మరింత విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. ప్రజాశీర్వాద పాదయాత్రకు గ్రామగ్రామాన, వీధివీధిన రోడ్డుకిరువైపులా యువత, మహిళలు ఉత్సాహంగా పూలవర్షం కురిపిస్తూ, బాణాసంచా కాల్చుతూ ఆహ్వానం పలుకుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాదయాత్రకు వస్తున్న జనాన్ని చూసి పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, పార్టీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, పార్టీ నాయకులు సంపంగి వేణుగోపాల్ తిలక్, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్ ఉన్నారు.